ప్రయత్నించటం మంచిదంటారా – మంచిదే మరైతే యుద్ధాలు అందుకే విధంగాను తోడ్పడవు. తల్లి గుణం ప్రేమించే గుణం యీ రెండూ లోపించిన తరువాత మనుషులు పందుల కంటె హీనంగా జీవిస్తారు.

పంది బురదమెచ్చు పన్నీరు మెచ్చునా అన్నారు. పందికి బురద అవసరం – పన్నీరు అవసరం లేదని కవులంతా తెలుసుకోవాలి. నిక్సన్‌ని పంది అని తిట్టకూడదు. అది చాలా తప్పు– బాంబులు తయారుచేసేవారి బాంబులు ఈ ప్రపంచాన్ని ఏల్తున్నంత కాలం బాంబులు ఎక్కడో ఒక చోట పడుతూ వుండాలి. ఇలా ఆలోచించి ఆలోచించి పంది గురించి బాధపడకండి సార్ లేవండి లేచి స్నానం చేసిరండి అన్నాను. మళ్లీ నమస్కారం చేశారు. బహుశా పందికే అయుంటుంది. నాకెందుకు చేస్తారు?

# ఆవకాయ మాహాత్మ్యం

"మానవత్వం – మామిడికాయ" అనే సబ్జక్ట్‌లో ఒక థీసిస్ రాసి ఆవకాయ డాక్టరేట్ కొట్టెయ్యాలనివుంది. లేకపోతే వాటీజ్ దిస్? ఆవకాయ పెట్టడం అనేది రాకెట్ ప్రయోగం కంటె డిఫికల్టాతి డిఫికెల్టయి పోయింది. మావారూ, నేనూ "టుబి ఆర్‌నాట్ టుబి" అన్న అవస్థలో పడ్డాం! ఆవకాయ పెట్టడమా, మానడమా, పెట్టడమా, మానడమా... దమడమ లాడిపోయింది. కచ్చా మేంగోస్ ముట్టుగుంటే ధర ప్రేలిపోతోంది. ఆవకాయ పెట్టడంకంటె చేతి బాంబులు తయారు చేయటం సింపులాతి సింపుల్ అనిపిస్తోంది. ఖర్చునేసరికి కొంచెం జారిపోయినట్టు కనిపించారు గాని మనిషి, ఖాళీ ఆవకాయజాడిని చూడగానే మళ్ళీ కరేజి పుంజుకుని పదండి ముందుకు పదండి తోసుకు పోదాం పోదాం బజారుకి అని బయల్దేరారు రవితేజములడరగ. ఆటల్లో చదరంగంలాగ. ఈగల్లో రాణీ ఈగలాగ, రాగాల్లో తోడిరాగంలాగ, యోగాల్లో భక్తియోగంలాగ, గాంధీల్లో ఇందిరాగాంధీలాగ, వూరగాయల్లో ఆవకాయ ఖింగ్–ఖింగ్ ఖింగే–సాంకేతిక పదజాలానికి ఇంగ్లీషుతో సాటిరాగల భాష లేదన్నారు. మరి ఆవకాయకు ఇంగ్లీషు ఉందీ. నోనో, పికిల్సుట పికిల్సు. ఆవకాయ మాంగో పికిల్సు అంటే మరి తొక్కుడు పచ్చడికేమంటారు? లాటిన్ భాషలో ఆవకాయకు సరైన పదంలేదు. అందాకా ఎందుకు మన దేశ భాష సంస్కృతములోమట్టుకు వుండేడిసిందా! "వెంకటేశ్వర మాహాత్మ్యం" అని సినిమా తీశారుకాని నన్నడిగితే "ఆవకాయ మాహాత్మ్యం" అని ఒక డాక్యుమెంటరీ విడుదల చేసుంటే ధణుతెగిరిపోయేది. ఒకావిడ ఆవకాయ జాడీ ప్లేన్‌లో ఎక్కించటానికి వీల్లేదంటే జెట్ ప్లేన్లోంచి సముద్రంలోకి దూకేస్తానందిట.

సత్యజిత్‌రాయ్‌కి ఒక చిన్న హార్లిక్స్ సీసాడు ఆవకాయ పంపిస్తే అతడింకా కళాఖండాలు ఘాటుగా తీస్తాడు. కష్టంలోగాని, సుఖంలోగాని ఒంటరిగా ఒక ఆవకాయ పెచ్చు ఎప్పుడూ

బొడ్డున దోపుకోవడమో, బేక్ పాకెట్లో వుంచుకోవడమో చేయాలి. అది ఒకప్పుడు చూయింగ్ గమ్‌లాను, మరొకప్పుడు ఫస్టెయిడ్ బాక్స్‌లాను కూడా పనిచేస్తుంది. ఆవకాయ పెచ్చునోట్లో పెట్టుకొని నమిల్తే వడదెబ్బ కొట్టదు. హార్ట్ ఎటాక్ అసలేరాదు నిఝం. నేను చెప్తున్నాను రాసుకోండి. అస్సలు మన డిఫెన్స్ సర్వీసెస్ కూడా బాజ్‌పాయి వాళ్లూ అణుబాంబు తయారుచేయాలంటారు. గాని, ఆవకాయముందు అణుబాంబేం పనిచేస్తుందండి మీ వెర్రిగానీ. ఆవకాయవూట ఓ రాచిప్పలో పోసుకుని ఒకొక్క చీనావాడి కంట్లో రెండేసి డ్రాప్స్ వేసుగుంటూ వెళ్తే మళ్ళీ వాడు లేవడు ఇండో-చైనా సంఘర్షణకు సరైన విరుగుడు, తుది పరిష్కారం ఆవకాయే! వియత్నాం సమస్య మటుకు ఆవకాయ వూటతో పరిష్కారం చేయలేమా? ఒకొక్క అమెరికన్ సైనికుడినీ పట్టుకుని మంగలి మహామంత్రి కథలో చెప్పినట్లు ముక్కులో వెంట్రుకల్ని చిన్న పట్టకారుతో వూడదీయటం, రెండు ముక్కుల్లోనూ యింత ఆవకాయవూట పోసెయ్యటం - పోరా పో అని కొరివికారం వంటికి రాసి కందిగుండతో నలుగెట్టి తోలెయ్యటం - ఆగ్నేయాసియాలో కాని, పశ్చిమాసియాలోకాని సుస్థిర శాంతిస్థాపనకు ఆవకాయ శరణ్యం. అస్తమించేటప్పుడు సూర్యుడెలా గుంటాడు? ఉదయ సూర్యుడెలా గుంటాడు? సింపుల్ ఆవకాయలా గుంటారు. అరుణ కిరణాలంటే ఏమిటి, ఆవకాయ కిరణాలే - పంచాయితీ ఎలక్షన్లనీ, పంచాయితీరాజ్ అనీ గ్రామాల్లో కొట్టుకుచస్తున్నారు. మన రాష్ట్రంలో పంచాయితీ ఎన్నికలు శాంతియుతంగా జరగాలంటే ఆవకాయజాడీలు ఫ్రీగా పంచాలి. ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగిన చోట్ల జాడీడు జాడీడు ఆవకాయ నామినేషను వుపసంహరించుకోవటానికి కరెన్సీ నోట్లకంటె ఎక్కువ బాగా ఉపయోగపడుతుంది.

అర్జునుడు శివుడ్ని పాశుపతాస్త్రం అడిగేడు. సత్యభామ శ్రీకృష్ణుడ్ని పారిజాతం తెమ్మంది. సీతాదేవి బంగారు లేడి కావాలంది. హరిశ్చంద్రుడ్ని ఒక్క అబద్ధం చెప్పమని అడిగాడు విశ్వామిత్రుడు. ఒక్కజాడీడు ఆవకాయముందు పాశుపతాస్త్రమనగానెంత, పారిజాతం పొంకమెంత బంగారు లేడి చేవ ఎంత, హరిశ్చంద్రుడు అబద్ధం ఆడ్డమనగా నెంత - ఆఫ్టరాల్ నథ్థింగ్! అలాగే నేను మావార్ని ఆవకాయ కాయ తెమ్మని అడిగాను. "ఏమాభూసురుడేగెనో, నడుమ మార్గశ్రాంతుడై డస్సెనో" ఎంతసేపటికీ రారు. ఆవకాయ విరహం క్షణక్షణానికి ఎక్కువై పోతోంది. ఎట్టకేలకు రిక్షాపై కపిరాజు అన్నట్లు సాక్షాత్తు హనుమంతుడ్లా చెప్పిన పని చేసుకువచ్చారు. డెబ్భైకాయలత్తెచ్చానే - డెబ్భై రూపాయలయిందన్నారు. పోన్లే అయితే అయిందిలెండి. సగం పట్టుచీర కొనలేదనుకుంటాను అన్నాను. అన్నానేకాని మామిడికాయ లమ్మేవారిలో మానవత్వం ఏ కోశానా లేదని పించింది. ఈ సంవత్సరం ఆంధ్రులకు ఆవకాయ తిండానికి లేకుండా చేస్తారా? వాటీజ్‌దిస్ చీఫ్ మినిస్టర్ యండ్వ్హిజ్ క్యాబినెట్ ఆర్‌డూయింగ్?

మధ్యంతర ఎన్నికలొస్తే ఆవకాయ కాయధరను అదుపు చేయలేని వారికి ఒట్లెవరిస్తారండీ! పెట్టండి అవిశ్వాస తీర్మానం పెట్టండి ఆంధ్రాగవర్నమెంటుపై...ఆవకాయ తీర్మానంమీద

ప్రభుత్వం తప్పకుండా ఓడిపోతుంది - బైగాడ్ - దేవునిమీద ప్రమాణంచేసి చెప్తున్నాను. మనదేశములో పుష్కలంగా పండే మామిడి కాయలను మనం తినడానికి నోచుకోకపోతే వాట్ ఫరాల్ దిస్? ఈ పెట్టుబడి దారీ వర్గం మామిడి కాయల్దగ్గర్నుంచీ లారీలమీద పైకితోలేసి లాభాలు గడించేసి ఆఖరికి టెంకల్ని కూడా మన్ని కళ్ళజూడనివ్వకుండా వున్నారు. "కంద చీమలతో కారప్పిండి జల్లి తింటే చిప్పిలునే కవనధార" అన్నాడు విప్లవకవి. అసలు కారల్‌మార్క్స్ ఆవకాయ తినబట్టే "మార్క్స్ సిద్ధాంతము" అనేది కనిపెట్టి రాశాడు - అని నేననుకుంటున్నాను. మావోకూడా కనీసం బెల్లపావకాయైనా తినేవుంటాడు. మా వారికి ఆవకాయలేందే ముద్ద దిగదు. ఆయన వడగళ్ళలో చదివిన పాత పద్యం ఒకటి కోట్‌చేస్తూ వుంటారు. అదే నేను మళ్ళీ మీకు చెబుతున్నాను.

కలిపెడిది ఆవకాయట
కలిపించెడివాడు మేనమామట నే
కలిపిన భవహరమగునట
కలిపెద వేరొండు వాయ కలుపగనేలా!

(ఇది ఆదితాళం ఆనందభైరవిలో చివరిచరణం పాడుకోవాలి. లేక పోతే మీ యిష్టమొచ్చిన రాగంలో తాళంలో పాడుకోండి) ఈ ఆవకాయ మాహాత్మ్యంబను ఇల్లాలి ముచ్చట్లందు సర్వంబును సంపూర్ణంబు. ఇది చదవని వారికి చదివిన వారికి ఆయురారోగ్య ఐశ్వర్య భక్తిముక్తి ఫలప్రాప్తిరస్తు, ఆవకాయ పెట్టినా పెట్టకపోయినా వ్రతం చెడ్డా ఫలంతప్పదు. ఓం మంగళం మహత్. కళ్ళుమూసుగుని ముక్కుపట్టుకోండి. ఆవకాయ జాడీ కనిపిస్తోందా లేదా - అదీ - అద్గదీ - కళ్ళు తెరవకండి. ఆ భయంకరమైన రెక్కల చప్పుడేమిటి అంటున్నారా? గరుత్మంతుడు కద్రువ పిల్లలకు చద్దెన్నాలలోకి ఆవకాయ పట్టికెళ్లడానికి వస్తున్నాడు. ఈ జాడీ పట్టుకెళ్లి పినతల్లికిచ్చి తన తల్లికి దాస్యవిముక్తి కలిగించబోతున్నాడు. కాని యీ ఆవకాయజాడి కాద్రవేయులకు దక్కకుండా ఇంద్రుడువచ్చి చావగొట్టి లాక్కుపోతాడు.

ఇంద్రుడి వేషం ఎవరు వేశారు? గరుత్మంతుడి వేషం ఎవరు వేశారు అంటున్నారా? నాకు తెలీదండీ.

# నిచ్చెన బొప్పాయి చెట్టూ

మెట్లు...మెట్లు....మేడ మెట్లు... ఎన్ని మెట్లెక్కినా కానరావేమయ్యా అన్నాడు కవి. (అసలుంటే కద కనిపించటానికి) ఒక రూలుంది, దాన్ని మెట్ల రూలుఅనొచ్చు. ఎన్ని మెట్లెక్కేమో అన్ని మెట్లు దిగాల్సిందే (పైనుండి పోతేతప్ప) మనిషి ఎంత పైకైనా వెళ్ళిపోగలడుకాని అక్కడ మకాం వేసుకుని వుండిపోలేడు. కాని పైకి వెళ్ళాలంటే ఏంబిషనుండాలి. మేడమెట్లు లేకుండా